సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం । 30 । జూలై । 2024



వరద బాధితులకు బాసట

చింతూరు డివిజన్ పరిధిలోని ముంపు గ్రామాల బాధితులకు రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సేవలు అందించారు. 8లో



అంబులెన్సు అందజేత 8లో

హెచ్‌పీసీఎల్ ఇచ్చిన అంబులెన్స్‌ను కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద్ పాడేరు గవర్న మెంట్ జనరల్ ఆస్పత్రికి అందజేశారు.



మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ

ఆర్‌వీనగర్‌లో మావోయిస్టులకు వ్యతిరేకంగా గిరిజనులు ర్యాలీ నిర్వహించారు. 8లో

న్యూస్‌రీల్

వరద బాధితులను ఆదుకుంటాం



శ్రీరామగిరిలో వరద బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

వీఆర్‌పురం: వరద బాధితులను ఆదుకుంటామని కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. మండలంలోని వరద ముంపు ప్రాంతాలైన ధర్మతాళ్లగూడెం, శ్రీరామగిరి ,సీతంపేట గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించి బాధితులతో మాట్లాడారు. దోమతెరలు, కిరోసిన్ ,టార్పాలిన్లు, రెండవదఫా కూరగాయలు అందజేయలేదని వరద బాధితులు కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరద బాధితులను ఆదుకుంటామని ఈ విషయంలో అధైర్యపడవద్దని వారికి నచ్చజెప్పారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, జెడ్పీటీసీ వాళ్ల రంగారెడ్డి ,తహసీల్దార్ సయ్యద్‌మౌలానాఫాజిల్ ,ఎస్సై కె.నాగరాజు,వెలుగు ఏపీఎం కిషోర్ ,రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చేపలవేట నిలిపివేయాలి

ఏఎస్పీ రాహుల్‌మీనా

చింతూరు: భారీ వర్షాలతో పాటు వరదలు ఉన్నందున చింతూరు డివిజన్ పరిధిలో నదులు, వాగుల్లో చేపలవేట నిలిపి వేయాలని చింతూరు ఏఎస్పీ రాహుల్‌మీనా సోమవారం ఓ ప్రకటనలో సూచించారు. భారీ వర్షాలకు శబరి, సీలేరు నదులతో పాటు పలు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని తెలిపారు. వీటిలో చేపలవేట కొనసాగిస్తే ప్రమాదాలు జరిగే అవకాశముందని ఆయన తెలిపారు. వర్షాలు, వరదలు తగ్గేవరకు ఎవరూ చేపలవేట సాగించవద్దని, నదులు, వాగులు దాటే ప్రయత్నం చేయవద్దని ఏఎస్పీ సూచించారు.

నాబార్డు కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సీజీఎం గోపాల్

సాక్షి, పాడేరు: జిల్లా కేంద్రం పాడేరులో నాబార్డు డీడీఎం కార్యాలయాన్ని సోమవారం ఆ సంస్థ సీజీఎం ఎం.ఆర్.గోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త జిల్లాలో నాబార్డు డీడీఎం కార్యాలయం సేవలు అందుబాటులోకి రావడం సంతోషంగా ఉందన్నారు. గిరిజనుల జీవన విధానం,వ్యవసాయం.ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా నాబార్డు సేవలు ఉండాలని, వినూత్న ప్రాజెక్టులను ప్రోత్సహించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాబార్డు అధికారులు కౌశల్‌కుమార్ సింగ్, సామంత్‌కుమార్, అనకాపల్లి డీడీఎం మత్తునాయుడు, ఎల్‌డీఎం వర్మ, పాడేరు డీడీఎం రావూరి చక్రధర్ పాల్గొన్నారు. అనంతరం నాబార్డు అధికారులకు డీసీసీబీ రుణాలను లబ్ధిదారులకు పంపిణీ చేసింది.

హమ్మయ్య..!



రహదారులపై వరదనీరు తొలగక చట్టి వద్ద భారీగా నిలిచిపోయిన లారీలు



వీఆర్‌పురం: గుట్టపై గుడారాల్లో తలదాచుకుంటున్న వరద బాధితులు

గత పది రోజులుగా వణికించిన గోదావరి, శబరి నదులు సోమవారం శాంతించడంతో విలీన మండలాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. వీటి ప్రవాహ ఉధృతి తగ్గినప్పటికీ చాలా గ్రామాలు, రహదారులు ఇప్పటికీ వరదనీటిలోనే ఉన్నాయి. మంగళవారం సాయంత్రానికల్లా వరద ప్రభావం పూర్తిగా **తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి.**



వీఆర్‌పురం మండలంలో శబరి బ్రిడ్జి సమీపంలోని రహదారిపై వరద నీరు తగ్గడంతో కూనవరం - వీఆర్‌పురం మండలాల మధ్య రాకపోకలు

- ఎగువ రాష్ట్రాల్లో తగ్గిన వర్షాలు
- భద్రాచలం వద్ద శాంతించిన గోదావరి
- శబరికి తగ్గిన వరద తాకిడి
- ఇప్పటికీ ముంపులోనే ప్రధాన, అంతర్గత రహదారులు

చింతూరు: మండల ప్రజలను ఆదివారం బెంబేలెత్తించిన శబరినది ఎట్టకేలకు శాంతించింది. చింతూరు వద్ద గరిష్టంగా 46 అడుగులకు చేరుకున్న నీటిమట్టం క్రమేపీ తగ్గుతూ సోమవారం రాత్రి 39 అడుగులకు చేరింది. ఎగువనున్న ఛత్తీస్‌గఢ్, ఒడిశాల నుంచి వరదనీరు తగ్గింది. భద్రాచలం వద్ద నీటిమట్టం 42.9 అడుగులకు సోమవారం తగ్గడంతో మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు.

ముంపులోనే గ్రామీణ రహదారులు

శబరినది వరద క్రమేపీ తగ్గుతున్నా మండలంలోని పలు రహదారులు ఇంకా ముంపులోనే ఉన్నాయి. చింతూరు, భద్రాచలం రహదారిలో వరదనీరు తొలగడంతో చట్టి వరకు మాత్రమే రాకపోకలు సాగుతున్నాయి. వీరాపురం వద్ద జాతీయ రహదారిపై వరదనీరు తొలగడంతో ఆంధ్రా, ఛత్తీస్‌గఢ్ మధ్య రాకపోకలు కొనసాగుతున్నాయి.

- **జాతీయ రహదారి–30పై చంద్రవంక, జాతీయ రహదారి–326పై కుయిగూరు వాగుల వరదనీరు ఇంకా నిలిచి ఉన్నందున తెలంగాణ, ఒడిశాకు** ఇంకా రాకపోకలు పునరుద్ధరణ కాలేదు.
- చింతూరు నుంచి కూనవరం, వీఆర్‌పురం మండలాలతో పాటు చింతూరు మండలంలోని 30 గ్రామాలకు సైతం రాకపోకలు నిలిచిపోయాయి.
- పూర్తిస్థాయిలో జాతీయ రహదారులపై పరిస్థితి మెరుగుపడక పోవడంతో ఆంధ్రా నుంచి తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశాకు వెళ్లాల్సిన వాహనాలు చట్టి వద్ద నిలిచి పోయాయి.

వీఆర్‌పురం: గత వారం రోజులుగా మండల ప్రజలకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్న గోదావరి ,శబరి నదులు సోమవారం కొంతమేర శాంతించాయి. భద్రాచలం వద్ద గోదావరి నది నీటిమట్టం సోమవారం సాయంత్రం 6 గంటలకు 43 అడుగులకు చేరింది. అలాగే శబరి ఎగువన కూడా వర్షాలు తగ్గుముఖం పట్టడంతో వరద తాకిడి తగ్గింది. కూనవరం –వీఆర్‌పురం మండలాల మధ్య రహదారిపైకి చేరిన వరదనీరు తగ్గుముఖం పట్టడంతో రాకపోకలు ప్రారంభమయ్యాయి. **శబరి నది నీటిమట్టం సోమవారం సాయంత్రం 6 గంటలకు 50 అడుగుల వరకు ఉంది. ఉధృతి కాస్త తగ్గినా చాలా గ్రామాల ప్రధాన, అంతర్గత రహదారులు వరదనీటి** లోనే ముంపులోనే ఉన్నాయి. దీంతో అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు పడవల ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు. గ్రామాలు ముంపు బారి నుంచి తేరుకోనందున వరద బాధితులు గుడారాల్లో తలదాచుకుని కాలం గడుపుతున్నారు.



వరద ప్రవాహానికి చింతూరు, చట్టి మధ్య దెబ్బతిన్న రహదారి



చింతూరు మండలం చట్టివద్ద జాతీయ రహదారి-30పై నిలిచి ఉన్న వరదనీరు



వీఆర్‌పురం: రేఖపల్లిలోని పునరావాస కేంద్రం వద్ద ఏర్పాటుచేసిన గుడారాల్లో తలదాచుకున్న వడ్డిగూడెం గ్రామ వరద బాధితులు



గెడ్డ దాటిస్తేనే చదువు సాగేది!

మారుమూల గ్రామాలకు వెళ్లే మార్గాల్లో వంతెనలు లేకపోవడం వల్ల గిరిజనుల అవస్థలు వర్ణనాతీతం. వర్షాకాలంలో వాగులు, గెడ్డలు దాటించి పాఠశాలలకు తరలించాల్సిన పరిస్థితులు కోకొల్లలు. మండలంలోని కొట్నాపల్లి పంచాయతీ పరిధిలోని వందిమెట్ట, చింతకొట్టు గ్రామాల్లో విద్యార్థులది ఇదే పరిస్థితి. ఈ ప్రాంతంలోని మండిగెడ్డ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈపరిస్థితుల్లో విద్యార్థులను కొంతమంది ఊతగాళ్లు సోమవారం ఉదయం భుజాలపై ఎక్కించుకుని గెడ్డ ప్రవాహాన్ని దాటించి పంచాయతీ కేంద్రంలోని కొట్నాపల్లి పాఠశాలకు తీసుకువెళ్లారు. సాయంత్రం పాఠశాల ముగిసిన తరువాత వారిని గెడ్డ దాటించి గ్రామాలకు తీసుకువచ్చారు. – హుకుంపేట

బోట్‌లో తరలించి.. ఆపద నుంచి కాపాడి..

- అధికారుల చొరవతో గర్భిణికి తప్పిన ప్రాణాపాయం
- సకాలంలో వైద్యం అందేలా అధికారుల చర్యలు
- మగబిడ్డకు జన్మనిచ్చిన మాతృమూర్తి



గర్భిణిని బోట్ ఎక్కిస్తున్న అధికారులు, స్థానికులు



బోట్‌లో తరలించేందుకు గర్భిణిని అంబులెన్సు ఎక్కించిన తహసీల్దార్ తదితరులు

వీఆర్‌పురం: తీవ్ర రక్తస్రావం బాధపడుతున్న గర్భిణిని బోట్‌లో ఆస్పత్రికి తరలించి వైద్యసేవలందించడంతో ప్రాణాపాయం తప్పింది. సకాలంలో స్పందించిన అధికారులను పలువురు అభినందించారు. వివరాలిలా ఉన్నాయి. శబరి, గోదావరి నదుల వరద ప్రవాహానికి మండలంలోని చాలా గ్రామాల రహదారులు ముంపులోనే ఉన్నాయి. దీంతో బయటకు వెళ్లేందుకు మార్గం లేకుండా పోయింది. అత్యవసర పరిస్థితుల్లో బోట్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి రేఖపల్లి పీహెచ్‌సీలో ఉన్న వీఆర్‌పురానికి చెందిన గర్భిణి ఎం.దుర్గాభవానీకి తీవ్ర రక్తస్రావం అవుతోంది. వైద్యాధికారి డాక్టర్ అనిల్ చికిత్స అందిస్తున్నప్పటికీ ఆమె పరిస్థితి మెరుగుపడలేదు. దీంతో ఈ విషయాన్ని తహసీల్దార్ సయ్యద్‌మౌలానా ఫాజిల్‌కు ఆయన తెలియజేశారు. వెంటనే తహసీల్దార్ స్పందించి కూనవరం మండలంలోని కోతులగుట్ట సీహెచ్‌సీకి తరలించేందుకు బోట్ ఏర్పాటు చేశారు. ఆస్పత్రి నుంచి అంబులెన్స్‌లో ఆమెను నాలుగు కిలోమీటర్ల దూరంలో ధర్మతాళ్ల గూడెం వరకు తరలించారు. అక్కడి నుంచి బోట్‌లో సుమారు పది కిలోమీటర్ల దూరంలో ఉన్న కోతుల గుట్ట సీహెచ్‌సీకి తీసుకువెళ్లారు. అక్కడ అత్యవసర వైద్యం అనంతరం మెరుగైన వైద్యం కోసం ఎన్‌డీఆర్‌ఎఫ్ బోట్‌లో చింతూరు ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ మగబిడ్డకు జన్మనిచ్చింది. ఇలావుండగా గర్భిణి కాన్పు సమస్యను తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్ వరద ప్రత్యేకాధికారి, రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరేకి తెలియజేయడంతో ఆయన ప్రత్యేకదృష్టి సారించారు. సకాలంలో ఆమెకు అత్యవసర వైద్యం అందేలా చర్యలు చేపట్టడం వల్ల ఆమె గండం నుంచి గట్టెక్కింది.

మూగ జీవాల ఆకలి రోదన

- మేత కోసం అల్లాడుతున్న పశువులు
- వరదతో గ్రామం విడిచే దారిలేక అవస్థలు
- గొర్రెల పెంపకందారులకు తప్పని ఇబ్బందులు



గౌరిదేవిపేటలో మేత కోసం పశువులను వరద నీటిని దాటిస్తున్న రైతులు



మేతకు వెళ్లే దారిలేక నందిగామలో రహదారిపై ఉన్న గొర్రెలు

ఎటపాక: గోదావరి వరదలతో పశువులకు తిప్పలు తప్పడం లేదు. గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నందున మేతకు వెళ్లే దారిలేక ఆకలితో అల్లాడుతున్నాయి. ఏటా గోదావరికి వచ్చే వరదల సమయంలో రైతన్నలు పశువుల రక్షణకు నానా తంటాలు పడుతున్నారు. ప్రస్తుతం సంభవించిన వరదల కారణంగా మండలంలోని గన్నవరం, గౌరిదేవిపేట, నందిగామ, మొరుమూరు, తోటపల్లి, కృష్ణవరం, నల్లకుంట తదితర గ్రామాలు జలదిగ్బంధంలో ఉన్నాయి. గోదావరి మధ్యన ఉన్న ఇసుక దిబ్బలపై మేతకు వెళ్లి పశువుల్లో కొన్ని గ్రామానికి చేరుకోలేదు. మిగిలిన పశువులు గ్రాసం సమస్య ఎదుర్కొంటున్నాయి. ఇవి గ్రామం విడిచి వెళ్ల దారి లేకపోవడంతో వాటి పోషణ పాడి రైతులకు భారంగా మారింది. ఈ పరిస్థితుల్లో వాటి ఆకలి తీర్చేందుకు ప్రాణాలకు తెగించి గ్రామాలను చుట్టుముట్టిన వరదనీటిని దాటిచి మేతకోసం తీసుకువెళ్తున్నారు. మేకలు, గొర్రెల పెంపకందారుల పరిస్థితి దయనీయంగా ఉంది. ఇవి వరదనీటిని దాటే అవకాశం లేనందున రహదారులపైనే ఉండిపోతున్నాయి. వరద తగ్గుముఖం పట్టిన ప్రాంతాల్లో పశుగ్రాసం బురదతో నిండి ఉన్నందున మేతకు ఉపయోగపడటం లేదు. ముందుకు కూడా వీటికి గ్రాసం సమస్య తీవ్రతరం కానుంది. ప్రభుత్వం స్పందించి గ్రాసాన్ని పంపిణీ చేసి మేత సమస్యను పరిష్కరించాలని పాడి రైతులు, గొర్రెల పెంపకందారులు కోరుతున్నారు.

ఏవోబీలో అణువణువు జల్లెడ

- గాలింపు ముమ్మరం చేసిన పోలీసు బలగాలు
- మావోయిస్టు అమర వీరుల వారోత్సవాల వేళ అప్రమత్తం



పాడేరు-విశాఖ ప్రధాన రహదారిలో తనిఖీలు



ఏవోబీలో మోహరించిన పోలీసు బలగాలు

సాక్షి, పాడేరు: మావోయిస్టు పార్టీ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల నేపథ్యంలో ఏవోబీ వ్యాప్తంగా పోలీసు బలగాలు జల్లెడ పడుతున్నాయి. జిల్లాలోని అటవీ ప్రాంతాలతో పాటు సరిహద్దు ఒడిశాలోను ప్రత్యేక పోలీసు పార్టీలు కూంబింగ్‌లో నిమగ్నమయ్యాయి. మావోయిస్టుల కదలికలు ఉన్నాయనే ప్రచారంతో ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో పోలీసు బలగాలు అడవిలో మోహరించాయి. ఎస్పీ అమిత్‌బర్దర్ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. మండల కేంద్రాలతో పాటు మారుమూల ప్రాంతాలకు పోయే రోడ్లలో వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. వారోత్సవాల రెండవ రోజు సోమవారం ఏవోబీ ప్రశాంతంగానే ఉంది.

పాడేరు: జిల్లా కేంద్రమైన పాడేరు నుంచి వెళ్లే ప్రతి మార్గంలోను పోలీసు బలగాలు తనిఖీలు ముమ్మరం చేశాయి. డాగ్, బాంబ్ స్క్వాడ్‌లు ప్రధాన రహదారులను ఆనుకొని ఉన్న అటవీ ప్రాంతాలు, కల్వర్టు, బ్రిడ్జిలను తనిఖీ చేశాయి. చెక్‌పోస్టుల వద్ద నిఘా, తనిఖీలు విస్తృతం చేశాయి. ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించే వాహనాలు, ప్రయాణికులను తనిఖీ చేసి విడిచిపెడుతున్నారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు అనుమానస్పదంగా సంచారిస్తే సమీపంలో ఉన్న పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు ప్రజలకు విజ్ఞాప్తి చేస్తున్నారు. మావోయిస్టు వారోత్సవాలు ముగిసే వరకు ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలని మండల కేంద్రాలను విడిచి వేరే ప్రాంతాలకు వెళ్లవద్దని ఇప్పటికే పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు.

వై.రామవరం: మండల కేంద్రం నుంచి సరిహద్దు అటవీ ప్రాంతానికి వెళ్లే ప్రధానరహదారిలో పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు.ఎస్ఐ ఎం.సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో నిఘా విధించారు.

రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం

- పాలనకన్నా దాడులకు ప్రాధాన్యం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ధ్వజం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి, చిత్రంలో అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం

పాడేరు: రాష్ట్రంలో పాలన వదిలేసి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నందున భయానక పరిస్థితులు నెలకొన్నాయని, ఇందుకు కూటమి ప్రభుత్వం బాధ్యత వహించాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని తలార్‌సింగి వద్ద మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారనే కారణంగా రాజకీయ కక్షలకు దిగుతూ తమ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు, సానుభూతి పరులపై దౌర్జన్యానికి దిగుతున్నారన్నారు. గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో రాష్ట్ర ప్రజలు సుఖంగా ఉన్నారన్నారు.

అదుపుతప్పిన శాంతి భద్రతలు

రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా అదుపు తప్పాయని, దీనిపై సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, హోం మంత్రి అనిత ఎందుకు స్పందించడం లేదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి విమర్శించారు. కూటమికి ఓటు వేయలేదనే కారణంతో దాడులకు తెగబడటం సరికాదన్నారు. ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ సమావేశాల్లో పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టకుండా ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టి రాష్ట్ర ప్రజలను కూటమి ప్రభుత్వం మభ్యపెట్టిందన్నారు. ఎన్నికల హామీలు, సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయలేకనే వాటిని బడ్జెట్ కేటాయింపు చేయలేక పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టలేకపోయారన్నారు. ఖరీఫ్ సీజన్‌లో ఒక్కో రైతుకు రూ.20 రైతు భరోసా సాయం అందిస్తామని చెప్పి సీజన్ వచ్చినప్పుడు రైతు భరోసా ఇవ్వకుండా రైతులను మోసం చేశారన్నారు. సూపర్‌సిక్స్‌ను అమలు చేయకుంటే అన్ని వర్గాల ప్రజలతో కలిసి పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు, ఎంపీటీసీలు సల్లా చిట్టమ్మ, కుంతూరు నర్సింహమూర్తి, లకే రామకృష్ణపాత్రుడు, సర్పంచ్‌లు వనుగు బసవన్నదొర తదితరులు పాల్గొన్నారు.

అరాచక పాలన: ఎమ్మెల్సీ కుంభా రవిబాబు



అరకులోయ రూరల్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అటవిక, అరాచక పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్సీ డాక్టర్ కుంభా రవి బాబు విమర్శించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రజలకు మాయమాటలు చెప్పి, తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. ప్రతిపక్ష నేతలపై రాజకీయ దాడులు,హత్య సంఘటనలకు పాల్పడడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన ప్రజలను, ప్రతిపక్షాలను అణిచివేసే ధోరణితో ఉందన్నారు. గవర్నర్ చేత కూడా అబద్ధాలు చెప్పించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 50రోజులు కావస్తున్నా ఇంతవరకు ఇచ్చిన హామీల ఊసెత్తకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం అన్యాయమన్నారు.వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఈపాటికే రైతులకు రైతుభరోసా, తల్లులకు అమ్మ ఒడితో ఆర్థికసాయం అందేదన్నారు. చివరకు పోలవరం ప్రాజెక్టు విషయంలోను చంద్రబాబు ప్రభుత్వం ప్రజలకు తప్పుడు సమాచారం ఇస్తుందని విమర్శించారు.

భయానక పరిస్థితులు: ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు



పాడేరు: రాష్ట్రంలో గతంలో ఎన్నడూ జరగని, చూడని భయానక పరిస్థితులు నెలకొన్నాయని, దీనిపై రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, రాష్ట్ర గవర్నర్ వెంటనే జోక్యం చేసుకొని పరిస్థితులను చక్కదిద్దాలని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన తన నివాసంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గద్దెనెక్కిన నాటి నుంచి నేటి వరకు పాలనను పక్కకు పెట్టి రెడ్ బుక్ రాజ్యంగాన్ని అమలు చేస్తూ వైఎస్సార్‌సీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులపై కక్ష కట్టి దాడులు, హత్యలకు పాల్పడుతున్నారన్నారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తున్నారన్నారు. బాలికలు, మహిళలపై లైంగిక దాడులు అధికమయ్యాయన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పాడేరు నియోజకవర్గంలో చాలా చోట్ల ఆస్తి, పంట నష్టం చోటుచేసుకుందన్నారు. అనేక చోట్ల రహదారులు ధ్వంసమయ్యాయన్నారు. వంతెనలు, కల్వర్టులు దెబ్బతిన్నాయని తెలిపారు. గిరిజనుల ఇళ్లు కూలిపోయిన సంఘటనలు ఉన్నాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి రహదారులకు మరమ్మతులు చేపట్టి బాధిత కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని ఆయన కోరారు.

క్లుప్తంగా

వరద బాధితులకు బాసట

చింతూరు: స్థానిక డివిజన్ పరిధిలోని వరదముంపు గ్రామాల్లో సోమవారం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వరద బాధితులకు సేవలు అందించారు.ముంపుబారిన పడిన కుటుంబాలకు 950 టార్పాలిన్లు, దోమతెరలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, కోశాధికారి వెంకటేశ్వరరెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ గౌరీశంకర్రావు, కో ఆర్డినేటర్లు లోహిత, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ

గూడెంకొత్తవీధి: మావోయిస్టులకు వ్యతిరేకంగా సోమవారం మండలంలోని ఆర్‌వీ నగర్ వారపు సంతలో గిరిజనులు ర్యాలీ నిర్వహించారు. మావోయిస్టుల వల్ల ఇప్పటి వరకూ వి. ధ్వంసం తప్ప ఎటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. వారి వల్ల అనేక మంది గిరిజనులు మృతి చెందారని వారు పేర్కొన్నారు. మావోయిస్టు అమర వీరుల వారోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో గిరిజనులు ఇలా వారికి వ్యతిరేకంగా ర్యాలీ చేయడం చర్చనీయాంశమైంది.

అంబులెన్సు అందజేత

మహారాణిపేట (విశాఖ): హెచ్‌పీసీఎల్ సీఎస్ఆర్ నిధుల కింద ఇచ్చిన అంబులెన్స్‌ను కలెక్టర్ అనుమతితో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ సోమవారం పాడేరు గవర్నమెంట్ జనరల్ ఆస్పత్రికి అందజేశారు. అంబులెన్స్ తాళాన్ని పాడేరు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్రకు అందజేశారు. డాక్టర్ విశ్వామిత్ర కేజీహెచ్ సూపరింటెండెంట్, కలెక్టర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

వాగులు దాటే ప్రయత్నం చేయొద్దు

కాలువల వద్ద పోలీసుశాఖ హెచ్చరిక బోర్డుల ఏర్పాటు


నూరుపూడి వాగు వద్ద హెచ్చరిక బోర్డును ఏర్పాటుచేసిన సీఐ రుద్రరాజు, భీమరాజు, సిబ్బంది


సీతపల్లి వాగు వద్ద పోలీస్ గస్తీని పరిశీలిస్తున్న సీఐ వెంకటేశ్వరరావు


మోతుగూడెంలో గిరిజనులతో మాట్లాడుతున్న ఎస్ఐ శివకుమార్

రంపచోడవరం/మోతుగూడెం/అడ్డతీగల/మారేడుమిల్లి/అరకులోయ టౌన్: నిరంతరాయంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఉప్పొంగి ప్రవస్తున్న కొండవాగులు వద్ద హెచ్చరిక బోర్డులను పోలీసుశాఖ అధికారులు ఏర్పాటుచేశారు.డొంకరాయి, మోతుగూడెం పోలీస్ స్టేషన్ల పరిధిలో చేపల వేట నిలిపివేయాలని, మోతుగూడెంలోని సోకులేరు వాగు వద్ద వ్యూ పాయింట్, పొల్లూరు వాటర్ ఫాల్స్ , పుష్ప బ్రిడ్జి వద్ద పర్యాటకుల సందర్శనం నిలిపివేసినట్టు ఎస్ఐ శివకుమార్ తెలిపారు. వీటి వద్ద పోలీస్ గస్తీ ఏర్పాటు చేయడంతో పాటూ ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రంపచోడవరం, దేవీపట్నం పరిధిలోని ఐ.పోలవరం, పాత సీతపల్లి, భూపతిపాలెం వద్ద వాగులు, పర్యాటక ప్రదేశాలకు ఎవరు వెళ్లవద్దని సీఐ వాసా వెంకటేశ్వర్లు తెలిపారు, గండిపోశమ్మ గుడి వద్ద గోదావరి నది ఉధృతంగా ఉన్నందున్న ఎవరు అటుగా వెళ్లవద్దని హెచ్చరించారు. రంపచోడవరంలో వాహనాలు తనిఖీ చేశారు. అడ్డతీగల మండలం పింజరికొండ,పణుకురాతిపాలెం, ఏలేరు వాగు వద్ద ఈ హెచ్చరిక బోర్డులను సోమవారం ఏర్పాటుచేసినట్లు ఎస్ఐ అప్పలరాజు చెప్పారు. మారేడుమిల్లి మండలంలోని సున్నంపాడు నుంచి నూరుపూడి వెళ్లే మార్గంలో ఉన్న కొండవాగు, బొడ్లంక మార్గంలో కల్వర్టుకు సమీపంలో ఉన్న వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, ఎవరూ దాటే సాహసం చేయవద్దని సీఐ రుద్రరాజు, భీమరాజు, ఎస్ఐ రాము హెచ్చరించారు. ఈ మేరకు వాగువద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేశారు.


విలేకరులతో మాట్లాడుతున్న అరకులోయ సీఐ రుద్రశేఖర్

అడ్డతీగల మండలం పైడిపుట్ట, వణుకురాతిపాలెం గ్రామాల్లోని వాగులను తహసీల్దార్ పి.నాగమణి పరిశీలించారు. ప్రమాదస్థాయిలో ఉన్న వాగులను దాటేందుకు ఎవరూ ప్రయాణించొద్దని సూచించారు. పణుకురాతిపాలెంకి తీగల వంతెన ఏర్పాటుకి పరిశీలించామన్నారు. ధాన్యంపాలెం వద్ద కన్నేరు వాగుపై ఉన్న పాత తీగల వంతెనను ఇక్కడికి తరలించి ఏర్పాటు చేయడానికి సాధ్యాసాధ్యాలను క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదిక ఇవ్వాలని ఐటీడీఏ పీఓ ఆదేశాలు ఇచ్చారన్నారు. ఇందులో భాగంగా ధాన్యంపాలెం వద్ద కన్నేరు వాగుపై ఉన్న పాత తీగల వంతెన పరికరాలను సోమవారం ఎంపీడీఓ రంగారావుతో కలసి వెళ్లి పరిశీలించామన్నారు. అరకులోయ పరిసరాల్లో కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు గెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయని, ఎవరూ వాగుల్లో వేటకు, ఇసుక తవ్వకాలకు వెళ్లొద్దని, పర్యాటక ప్రాంతాల్లో జలపాతాల వద్దకు వెళ్లొద్దని సీఐ రుద్రశేఖర్ సూచించారు. మావోయిస్టు వారోత్సవాల సందర్భంగా అంతరాష్ట్ర సరిహద్దుల్లో కూంబింగ్ జరుగుతుందన్నారు. మావోయిస్టుల హిట్ లిస్టులో ఉన్న అరకు సర్కిల్ పరిధిలోని మూడు మండలాల్లో ఉన్న 114 మందికి సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించామన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి తరచూ వాహనాల తనిఖీ చేస్తున్నామన్నారు. సమావేశంలో ఎస్ఐ సంతోష్ పాల్గొన్నారు.


వాగు వద్ద పర్యవేక్షిస్తున్న ఎస్ఐ అప్పలరాజు, సిబ్బంది


ధాన్యంపాలెంలోని కన్నేరు వాగుపై ఉన్న పాత తీగల వంతెనను పరిశీలిస్తున్న తహసీల్దార్ నాగమణి, ఎంపీడీవో రంగారావు తదితరులు

పారదర్శకంగా ప్రభుత్వ సాయం పంపిణీ

- ప్రతి బాధిత కుటుంబానికి రూ.3 వేలు
- కలెక్టర్ దినేష్‌కుమార్

చింతూరు: వరద బాధితుల్లో ప్రతి కుటుంబానికి రూ.3వేల చొప్పున ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్థికసాయాన్ని మంగళవారం నుంచి పారదర్శకంగా పంపిణీ ప్రారంభించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టర్ క్యాంపు స్థానిక కార్యాలయం నుంచి వరదల నోడల్ అధికారులు, జిల్లా అధికారులు ముంపు మండలాల అధికారులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ముందుగా వీఆర్‌పురం, కూనవరం మండలాల్లో పంపిణీ చేయాలని సూచించారు. మరుసటి రోజు ఎటపాక, చింతూరు మండలాల్లో పంపిణీ చేపట్టాలన్నారు. అయితే పంపిణీలో ఎటువంటి అవకతవకలు జరిగినా సహించేది లేదని హెచ్చరించారు. అదే విధంగా నగదు పంపిణీ స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామస్థాయి కమిటీ సభ్యుల సమక్షంలో అందజేయాలని సూచించారు. ఎక్కడ ఎప్పుడు పంపిణీ చేస్తున్నది ముందుగానే ప్రజలకు తెలియజేయాలని ఆదేశించారు. పంపిణీ పకడ్బందీగా.. అనుమానాలకు తావులేకుండా అత్యంత పారదర్శకంగా జరగాలని సూచించారు. అదే విధంగా ప్రభుత్వం అందిస్తున్న 25 కిలోల ఉచిత బియ్యం కూడా సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు. వచ్చేనెల ఒకటి నుంచి పింఛన్ల పంపిణీ ఉన్నందున అంతకు ముందే ఆర్థిక సహాయం, ఉచిత బియ్యం పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఎటపాక, కూనవరం, వీఆర్‌పురం, చింతూరు మండలాల వరద నోడల్ అధికారులు డా. అభిషేక్ గౌడ్, సూరజ్ గనోరే, ఎస్. ప్రశాంత్ కుమార్, వి. చైతన్య, జిల్లా అధికారులు, నాలుగు ముంపు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు సంబంధిత శాఖ అధికారులు హాజరయ్యారు.

కలెక్టర్ దృష్టికి వరద బాధితుల సమస్యలు


కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వరద బాధితుల సమస్యలను తెలియజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వీఆర్ పురం: కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వరద బాధితుల సమస్యలు తెలియజేసినట్టు వైఎస్సార్‌సీపీ మండల వైస్ కన్వీనర్ చిక్కాల బాలు, అరకు పార్లమెంట్ కార్యదర్శి బొడ్డు సత్యనారాయణ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం కలెక్టర్ దినేష్‌కుమార్‌ను వారు కలిసి వరద బాధితులు పడుతున్న ఇబ్బందులును తెలియచేశామన్నారు. వరద వచ్చి సుమారు 10రోజులు దాటినా బాధితులకు నేటికి పూర్తి స్థాయిలో నిత్యావసరాలు అందించలేదని, గతంలో టార్పాలిన్లు ఇచ్చిన వారికి కూడా ఇప్పుడు టార్పాలిన్లు ఇవ్వాలని ఆయనకు తెలియజేశామన్నారు. సమస్యలు పరిష్కరిస్తామని కలెక్టర్ దినేష్‌కుమార్ హామీ ఇచ్చారని వారు చెప్పారు. ఉప సర్పంచ్ శ్రీను, నరేష్ , నాగార్జున, వెంకన్న , పోసి తదితరులున్నారు.

పూరిల్లు దగ్ధం


కాలిపోతున్న పూరిల్లు

కొయ్యూరు: మండలంలోని బకులూరులో సోమవారం జరిగిన అగ్నిప్రమాదంలో కె.కన్నయమ్మకు చెందిన పూరిల్లు మొత్తం కాలిపోయింది. బాధితురాలు సర్వం కోల్పోయింది. ఇంటి నుంచి ఆకస్మికంగా మంటలు వ్యాపించాయని, అదుపు చేసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు చెప్పారు. ఇంట్లో ఉన్న మొత్తం సామగ్రి కాలిపోయిందని, అధికారులు ఆదుకోవాలని బాధితురాలు కన్నయమ్మ కోరారు.

పాఠాలు బోధించిన అరకు ఎమ్మెల్యే

పంతలచింతలో విద్యార్థులతో కలిసి భోజనం


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం


విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం

డుంబ్రిగుడ (అరకులోయ టౌన్): మండలంలోని పోతంగి పంచాయతీ పంతలచింత ప్రాథమిక పాఠశాలను అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు భోజనం స్వయంగా వడ్డించడమే కాకుండా వారితో కలిసి భోజనం చేశారు. విద్యార్థులతో ఆంగ్ల పదాలను చదివించి వారి సామర్థ్యాన్ని పరిశీలించారు. విద్యా ప్రమాణాల మెరుగుకు కృషి చేయాలని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు. నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. విద్యార్థులు పోటీ ప్రపంచంలో నిలదొక్కుకునేలా విద్యార్థులను తయారు చేయాలని ఆదేశించారు. ఎంఈవో సుందరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుపై రైతుల ఆసక్తి

డ్వామా పీడీ శివయ్య


కప్పాడలో రైతులకు సిల్వర్ ఓక్ మొక్కలను పంపిణీ చేస్తున్న డ్వామా పీడీ శివయ్య

పెదబయలు: మండలంలోని లక్ష్మీపేట పంచాయతీ కప్పాడ గ్రామంలో జిల్లా డ్వామా పీడీ ఎం.శివయ్య సోమవారం పర్యటించారు. గ్రామంలో సుమారు 29 మంది రైతులకు సిల్వర్ ఓక్ మొక్కలను పంపిణీ చేశారు. రైతులు మొక్కలు నాటే ప్రదేశాల్లో వెళ్లి గుంతలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఐటిడిఏ పీవో ఆదేశాల మేరకు 5723 మంది రైతులు. 5894 ఎకరాల విస్తీర్ణంలో 2024-25 సంవత్సరంలో సిల్వర్ ఓక్ తోటల పెంపకానికి సంబంధించి మొక్కల పంపిణీ చేసినట్టు చెప్పారు. రైతులు ఎక్కువగా సిల్వర్ ఓక్‌పై తోటల పెంపకానికి ఆశక్తిని చూపిస్తున్నారని మూడేళ్ల తరువాత ఇదే తోటల కంద కాఫీ, మిరియాలు, పైనాపిల్ సాగు చేసుకునే అవకాశం ఉందన్నారు. దీంతో పాటుగా జీడిమామిడి. నిమ్మ, సపోట తోటల పెంపకానికి ఆశక్తి కనబరుస్తున్నారన్నారు. ప్రతీ మొక్కకు రైతులు రక్షణ కల్పించి పశువులు తినకుండా కంచే ఏర్పాటు చేయాలని సూచించారు. రైతులకు ఉపాధి పథకం ద్వారా ఎలాంటి సందేహాలున్నా ఏపీవోలను సంప్రదించవచ్చన్నారు. కప్పాడ గ్రామంలో బావి నిరుపయోగంగా ఉందని వినియోగంలోకి తేవాలని గ్రామ రైతులు కోరడంతో అంచన తయారు చేసి పంపాలని ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. సరైన సీజన్‌లో మొక్కలను పంపిణీ చేయడంపై రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ప్లాంటేషన్ మేనేజర్ వి.కిజియ, ఈసీ సింహాచలం, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ సింహాచలం, సాంకేతిక సహాయకులు క్షేత్ర స్థాయి సహాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాలుడి మృతి

కూనవరం: అనారోగ్యంతో కొండరెడ్డి బాలుడు కెచ్చల శివారెడ్డి (12) మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని టేకులద్ది గ్రామంలో సోమవారం చోటు చేసుంది. తల్లి దండ్రుల కథనం ప్రకారం అనారోగ్రానికి గురైన శివారెడ్డిని ఈనెల 26న చింతూరు ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ వివిధ పరీక్షలు నిర్వహించగా ఊపితిత్తులు దెబ్బతిన్నట్లు, గుండె సంబధిత వ్యాధి ఉన్నట్లు తేలింది. తక్షణం రంపచోడవరం లేదా భద్రాచలం తరలించాలని వైద్యులు సూచించారు. భద్రాచలంలో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు ఊపిరితిత్తులు, గుండె, లీవర్ సంబంధిత సమస్య ఉన్నట్టు గుర్తించారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలిస్తుండగా ఆదివారం సాయంత్రం మార్గమధ్యలో మృతి చెందాడు. బాలుడి మృత దేహాన్ని సోమవారం స్వగ్రామం టేకులొద్దిలో దహన సంస్కారాలు నిర్వహించారు.

యువకుడి గల్లంతుపై ఫిర్యాదు


సోమనాథ్ (ఫైల్)

డుంబ్రిగుడ(అరకులోయటౌన్): మండలంలోని గుంటసీమ గ్రామానికి చెందిన కిల్లో సోమనాథ్(18) ఆదివారం సాయంత్రం టిప్పర్‌లో ఇసుక లోడు చేసి గెడ్డ దాటే క్రమంలో వాగులో కొట్టుకుపోయాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామ సమీపంలోని పాముురాయి గెడ్డ వద్ద సోమనాథ్ గల్లంతయ్యాడు. ఆచూకీ దొరకకపోవడంతో యువకుడి గల్లంతు సంఘటనపై గుంటసీమ సర్పంచ్ గుమ్మ నాగేశ్వరరావు డుంబ్రిగుడ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పాడేరు ఐటీడీఏ పీవో కార్యాలయంలో కూడా ఫిర్యాదు నమోదు చేసినట్టు ఆయన చెప్పారు. హెల్ప్ లైన్ నెంబర్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసినా ఎన్‌డీఆర్‌ఎఫ్ అధికారులు కూడా స్పందించలేనట్టు సర్పంచ్ నాగేశ్వరరావు తెలిపారు. ఇదిలా ఉండగా ఈ విషయం తెలుసుకొని ఢిల్లీలో ఉన్న అరకు ఎంపీ డాక్టర్ గుమ్మ తనూజరాణి ఫోన్‌లో సోమనాథ్ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

నాణ్యమైన కాఫీ పౌడర్ ఉత్పత్తులతో ఆర్థికాభివృద్ధి

కేంద్ర కాఫీబోర్డు రిసెర్చ్ స్టేషన్ అధికారి డాక్టర్ సునీల్


శిక్షణ పొందిన గిరిజన మహిళలతో కేంద్ర కాఫీబోర్డు అధికారి డాక్టర్ సునీల్, టెక్నో సర్వ్ అధికారులు

సాక్షి, పాడేరు: కాఫీ గింజలను నాణ్యమైన పౌడర్‌గా తయారు చేయడం ద్వారా మరింత ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని కేంద్ర కాఫీబోర్డు ఆర్‌వీ నగర్ రిసెర్చ్ స్టేషన్ అధికారి డాక్టర్ సి.సునీల్ సూచించారు. సాగు చేసే 25మంది గిరిజన మహిళలకు స్థానిక గెడ్డంపుట్టులోని మన్యతోరణం రైతు ఉత్పత్తిదారుల సంఘంలో కేంద్ర కాఫీబోర్డు, టెక్నో సర్వ్ సంస్థలు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించాయి. కాఫీ పౌడర్ తయారీ, ప్యాకింగ్, మార్కెటింగ్ అంశాలపై సమగ్ర శిక్షణ ఇచ్చారు.ఈ సందర్భంగా డాక్టర్ సునీల్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో సాగుచేసిన కాఫీకి విదేశాల్లో మంచి ఆదరణ ఉందన్నారు. ఈ మేరకు నాణ్యత విషయంలో కాఫీ రైతులంతా మరింత శ్రద్ధ వహించాలని సూచించారు. కాఫీ పౌడర్ ఉత్పత్తులను తయారు చేసుకోవడం ద్వారా సొంతంగా కాఫీ దుకాణాలను ఏర్పాటు చేసుకుని గిరిజన మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలన్నారు. అనంతరం శిక్షణ పొందిన అనంతగిరి, డుంబ్రిగుడ, అరకులోయ, పాడేరు.జి.మాడుగుల మండలాలకు చెందిన 25మందికి ధ్రువీకరణ పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు.

అడవుల సంరక్షణపై అవగాహన


విజేతలకు బహుమతులిస్తున్న ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ మోహన్‌రావు తదితరులు

గంగవరం: రాయపల్లి ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ బి.మోహన్ రావు ఆధ్వర్యంలో మోహనాపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పులుల ఆవశ్యకత, పులులు గురించి , అడవుల సంరక్షణ గురించి అవగాహన కల్పించారు. పై అంశాలపై చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. పోటీల్లో విజేతలకు బహుమతులను ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ మోహన్‌రావు, బీట్ ఆఫీసర్ పి.పురుషోత్తం , హెచ్‌ఎం బాలరాజు తదితరులు అందజేశారు ఉపాధ్యాయులు రమేష్, రాంబాబు. బాబురావు, సోమయ్య తదితరులు పాల్గొన్నారు. స్థానిక జూనియర్ కళాశాల, బాలుర ఉన్నత పాఠశాలలో ఫోక్స్‌పేట రేంజ్ ఆఫీసర్ ఎం.కరుణాకర్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ పులుల దినోత్సవం నిర్వహించారు. అటవీశాఖ సిబ్బంది తదిరతులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

కూనవరం: గుర్తు తెలియని మృతదేహం ఎగువ నుంచి వచ్చిన వరద నీటిలో కొట్టుకొచ్చి కూనవరం శబరి బ్రిడ్జి వద్ద చేరిన తుక్కులో చిక్కుకుంది. దుర్వాసన రావడంతో గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ శ్రీనివాసరావు ఘటనా స్థలానికి వెళ్లి ఆ మృతదేహాన్ని వెలికి తీయించి శవ పంచనామా నిర్వహించి కేసు నమోదు చేశారు. మృతదేహం ఆచూకీ తెలిసిన వారు స్థానికి పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

ఉపాధి కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కిరణ్ వర్మ

అరకులోయ టౌన్: ఏపీ డవలప్‌మెంట్ అండ్ ట్రెనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ఫుడ్ అవుట్‌లెట్ మేనేజర్/హౌస్ కీపింగ్ మేనేజర్ శిక్షణ కొరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు స్థానిక వైటీసీ ప్రిన్సిపాల్ జి.కిరణ్ వర్మ తెలిపారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. నిరుద్యోగ యువతీ యువకులకు టూరిజం సెక్టార్, హాస్పిటాలిటీ విభాగంలో ఫుడ్ అవుట్ లెట్ మేనేజర్, హౌస్ కీపింగ్ మేనేజర్ పోస్టులకు శిక్షణ కల్పిస్తామన్నారు. శిక్షణ సమయంలో ఉచిత భోజన, వసతి సదుపాయం, యూనిఫారం, రెండు జతల బూట్లు, బ్యాగ్, ట్రయినింగ్ మెటీరియల్ అందిస్తామన్నారు. ఐదు నెలల పాటు శిక్షణ ఇచ్చి ఉద్యోగం కల్పిస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు తమ ఒరిజనల్ విద్యార్హత ధ్రువపత్రాలతో వచ్చేనెల ఒకటో తేదీన అరకులోయ డిగ్రీ కళాశాల సమీపంలోని తమ కార్యాలయంలో హాజరు కావాలని ఆయన సూచించారు. పూర్తి వివరాలకు 6303511674, 7337004515 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం


మగతపాలెంలో గ్రామస్తులతో ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి

జి.మాడుగుల: ఐసీడీఎస్ అధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారం, సదుపాయాలు లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యలక్ష్మి తెలిపారు. మండలంలో గడుతూరు పంచాయతీ మగతపాలెం గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం ఆమె సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన గర్భిణులతో మాట్లాడి ఆరోగ్యం, వైద్య పరీక్షలు, వారికి అందుతున్న వైద్యసేవలను ఆమె అడిగి తెలుసుకున్నారు. గర్భిణులకు ఆస్పత్రుల్లో ప్రసవాలపై ఆమె అవగాహన కల్పించారు. గ్రామంలో వైద్య సిబ్బంది నిర్వహించిన వైద్య శిబిరాలు, పారిశుద్ధ్య కార్యక్రమాలను ఆమె పరిశీలించారు. శిబిరంలో 26 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి తదితరలు పాల్గొన్నారు.

రహదారిపై కూలిన భారీ చెట్టు


పాడేరు ప్రధాన రోడ్డులో కూలిన భారీ చెట్టు

జి.మాడుగుల: జాతీయ రహదారి 516ఈ పాడేరు రోడ్డు మార్గంలో సోమవారం సాయంత్రం భారీ వృక్షం కూలింది. ఈ రోడ్డు మార్గంలో కె.కోడాపల్లి గ్రామ సమీపంలో ఉన్న భారీ చెట్టు ఈదురుగాలులకు రోడ్డుకు అడ్డంగా కూలిపోవటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమీపంలో ఉన్న 33కెవీ విద్యుత్ సరఫరా తీగలకు చెట్టు కొమ్మలు తగిలి మంటలు చెలరేగాయి. దీంతో జి.మాడుగుల మండల కేంద్రంలో గల విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ప్రాంతాలకు సరఫరా నిలిచింది. ఆయా శాఖాధికారులు, సిబ్బంది విద్యుత్ సరఫరాన పునరుద్ధరణకు చర్యలు చేపడుతున్నారు.

గిరిజన విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్న కుమార్

రంపచోడవరం: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ప్రాంతీయ విస్తృత సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశానికి రంపచోడవరం డివిజన్ ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు గణేష్ అధ్యక్షత వహించగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్న కుమార్ హాజరయ్యారు.ఈ సందర్భంగా కె.ప్రసన్న కుమార్ మాట్లాడుతూ గత రెండు రోజులుగా సంఘం బృందం హాస్టళ్ళు, కళాశాలలో సందర్శించి విద్యార్థుల ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నమన్నారు. ఈ పర్యటనలో విద్యార్థులు సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. జూనియర్ కళాశాలకు రెగ్యులర్ ప్రిన్సిపల్ లేక అడ్మినిస్ట్రేషన్ అస్తవ్యస్తంగా ఉందన్నారు. మధ్యాహ్న భోజన పథకం జూనియర్ కళాశాలలో అమలు చేయాలని కోరారు.వసతి గృహాల్లో మెనూ పాటించడం లేదని, పౌష్టికాహారం అందక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణా లోపం తీవ్రంగా ఉందన్నారు. గిరిజన వసతి గృహాలకు హెల్త్ వలంటీర్లను నియమించామని కోరారు. డిగ్రీ కళాశాలకు ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని, ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.గిరిజన విద్యార్థుల సమస్యలను పరిష్కారానికి ఫెడరేషన్ తరఫున కృషి చేస్తామన్నారు. ఆగస్టు 9న జరిగే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని సెలవు దినంగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు.

రంపచోడవరం ప్రాంతీయ కమిటీ ఎన్నిక

ఎస్ఎఫ్ఐ ప్రాంతీయ కమిటీని ఎన్నుకొన్నారు. ఈ మేరకు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా సోడే గణేష్, సోడే వినోద్ ఎంపికయ్యారు. కన్వీనర్లుగా స్పందన, సౌజన్య, ఎంపిక కాగా రాహుల్, దేవేంద్ర రెడ్డి, సారథి, సాయి తేజ లు ఆఫీస్ బేరర్స్‌గా ఎంపికైనట్టు ప్రతినిధులు ప్రకటించారు.